"తల్లి"

శ్రీ ఏకా వెంకటసుబ్బారావు

"అమ్మా, అమ్మా ... ... పరీక్ష ప్యాసయ్యానే" అంటూ దిన పత్రిక తీసుకొని వచ్చాడు సత్యం.

"ఏదీ, పేపరులో పేరు పడ్డదా! నాయనా!"

"పేర్లు వేయరమ్మా నెంబర్లు వేస్తారు"

"ఏమో ... నాయనా ... నాకేమి తెలుసు? సుబ్బయ్యగారి అబ్బాయికూడా ప్యాసయినాడా? నాయనా"

"లేదమ్మా"

"పాపం! ... ఈ మారు కూడా తప్పాడన్న మాట. ఏమయితేంలే, నీవు ప్యాసయినావు—నాకదే కావాలి నాయనా—నా రెక్కల కష్టం ఫలించుతే చాలు"

"అమ్మా! ... నేను బజారుదాకా వెళ్లివస్తా"

"సరే, నాయనా. తొందరగా రా ...... అబ్బాయీ! ... ... సత్యం! ... ... ఒక్క మాట. కాసేపు ఆగునాయనా." అంటూ లోపలికి వెళ్ళి వెంటనే వచ్చి "నాయనా! ఈ రూపాయి ఖర్చు పెట్టుకో" అని ప్రేమతో ఆనంద బాష్పాలు కురిపిస్తూ కుమారుని చేతిలో పెట్టింది. సత్యం ఆనందంతో బయటకు పరుగుతీసాడు.

అవును ... పాపం...ఆతల్లికి కావలసిందేమిటి! చిన్ననాడే భర్త, ఈ బిడ్డను భూమిపైవదలి, తాను పరలోక గతుడయినాడు. చిల్లి గవ్వంత ఆస్తియూ లేకపోయెను. ఆమె దిక్కుచూచేదెవరు? ఎవరయినా డబ్బు ఉంటేనే, మావాళ్లు అని చెప్పుకొని తిరుగుతారు. ఏమాత్రం డబ్బు లేకపోయినా, దగ్గర బంధువులుకూడా కన్నెత్తి చూడరు. ఏమిచేస్తుంది? బస్తీ కాని ఆపల్లెటూరిలోనే పూటకూళ్ళశాలను ఏర్పాటు చేసి, కష్టపడి తనకుమారుని చదివించుకొంటున్నది. బళ్ళోకూడా ఇతనిని ఎవ్వరూ "సత్యం" అనిచెప్పుకొనే వారుకారు. అతను, ఎవరురా? అంటే పూట కూళ్ళ శీతమ్మ కొడుకు అనే వారు. ఎవరయితేనేం — చదువులో మంచి శ్రద్ధ చూపుచూ, ఉపాధ్యాయుల మన్ననలను పొందుతుండెడివాడు. మంచి పిల్లవాడని అందరిచే అనిపించుకున్నాడు.

"ఏం, శీతమ్మగారూ! ఏమిటి, ఇవ్వాళ విశేషం? చాలా, చాలా పిండివంటలు చేసారు."

"అవును, బాబూ! మా అబ్బాయి స్కూలు ఫైనలు పరీక్ష ప్యాసయ్యాడు. ఇవ్వాళనే పేపరులో వేసారట"

"ఓహో, అదా...సంగతి. అయితే అబ్బాయి ఇక కాలేజీ స్టూడెంటు అన్నమాట"

"ఏమో, బాబూ—కాలేజీ బడి ఈ ప్రాంతంలో లేదాయె. అందుకని పట్నం పంపుదామనుకుంటున్నాను. ఏదో, రెక్కల కష్టం"

"అవునండీ, మీకుఱ్ఱవాడు చాలా వృద్ధిలోకి వస్తాడు"

"మీబోటి పెద్దల ఆశీర్వచనములు చాలు నాయనా ఎంత కష్టపడి అయినా చదివించుతాను."

"అమ్మా! కాలేజిలో సీటువచ్చిందే!! నాల్గు రోజులలో మద్రాసు పోవాలి."

"సరేలే నాయనా! పోవుదువుగాని. జాగ్రత్తగా చదువుకో. మన పొలిమేఱదాటి ఎరుగవు. క్రొత్త

చోటు. జాగ్రత్తగా ఉండాలి నాయనా. చెడుసావాసాలకు పోకు. జనసమర్ధమయిన పట్టణం. బజార్లలో జాగ్రత్తగా పోతూ ఉండాలి. ఎవ్వరితోనూ విరోధం పెట్టుకోవాకు ......"

"ఏమిటమ్మా, నీ పిచ్చిగాని, చిన్నపాడినా— ఇన్ని చెబుతున్నావు"

"ఏమో, నాయనా, నీవు నాకు చిన్నపిల్లవాడివే ... తల్లి మనస్సు నాయనా... ఏదో చెప్పలేకుండా ఉండలేదు. డబ్బుకు ఇబ్బంది పడకు; నీవు బాగా చదువుకొంటూ ఉంటే, అదేచాలు; నాల్గురోజులకొక ఉత్తరం వ్రాస్తూ ఉండు. రాత్రిళ్ళు ఒంటరిగా తిరుగవాకు"

"సరే లే, అమ్మా"

సత్యం మద్రాసు కాలేజీలో చేరాడు. ఇంటర్మీడియట్ మొదటి తరగతిలో ప్యాసయ్యాడు. బి. ఏలో చేరాడు. అదికూడా మొదటి తరగతిలోనే ప్యాసయ్యాడు. శీతమ్మ, సత్యంలను గురించి ఆ గ్రామంలో చెప్పుకోనివారులేరు. యం. ఏ. లో చేరాడు.

"ఏం శీతమ్మగారూ! సత్యం దగ్గరనుంచి ఉత్తరాలు వస్తున్నాయా ?"

"ఆ, వస్తునే ఉన్నాయి బాబూ, కులాసాగానే ఉన్నాడు. ఈ ఏటితో చదువయిపోతుంది."

"ఏమోలేండి. పాపం!! మీకష్టం అక్కరకు వచ్చింది. ఆ!! అన్నట్లు మరిచాను. అబ్బాయి వివాహం ఈ సంవత్సరం ఏమయినా చేయదల్చుకున్నారా ? మొన్న, బెజవాడ కోర్టు పని మీద వెళ్ళాను. మా ప్లీడరుగారికి ఒక్కతే ఒక్కకూతురు. అమ్మాయి అప్సరసలాగా ఉంటుంది. వారికా ... దాదాపు మూడు లక్షలరూపాయల ఆస్తి ఉంది. అమ్మాయికూడా యఫ్. ఏ ప్యాసయింది. మొన్న మాట వరసకు మీ విషయం వచ్చింది. వారు మాట్లాడి చూడమన్నారు. మనము పోయి అమ్మాయిని చూచుకొని రావచ్చు."

"ఆ! అంత అదృష్టమా బాబూ!! ఏమయినా అబ్బాయి ఒప్పుకోవాలిగా. అయినా ఈ పూట కూళ్ళ సీతమ్మకొడుకు ఎక్కడ ? వారి అంతస్తు ఎక్కడ ?"

"మీరు ఏమీ సందేహించకండి. నేను అన్నీ మాట్లాడుతాను. మీరుకూడా కుమారునితో అక్కడే కాలక్షేపం చేయవచ్చును."

"సరేలే, బాబూ! అబ్బాయి వచ్చింతర్వాత మాట్లాడి చెపుతాను."

సత్యం దసరా శెలవులకు ఇంటికి వచ్చాడు. తల్లి విషయం అంతా తెలియచేసింది. సత్యంకు మాత్రం అంత పెద్ద సంబంధం చేసికోవడం ఇష్టం లేదు. కాని తల్లి ఆదేశంవల్ల ఒప్పుకోక తప్పింది కాదు. తిధి, వార, నక్షత్రములుచూచి బెజవాడ ప్రయాణమయ్యారు. అమ్మాయికి అబ్బాయి, అబ్బాయికి అమ్మాయి నచ్చారు. సీతమ్మ తన కుమారునకు ఇంత అదృష్టం పడుతున్నందులకు ఆనందానికి మేరలేదు. బారిష్టరు ఆనందరావుగారు అన్ని విషయాలు తర్వాత తెలియచేస్తామన్నారు.

అనుకున్నట్లుగానే నాలుగు రోజులలో కబురు చేసారు. అన్నీ బాగనే ఉన్నాయికానీ, సీతమ్మగారికి ఒక్క విషయంలో మాత్రం మనస్సు చివుక్కుమనక తప్పిందికాదు. అబ్బాయిని ఇల్లరికం అడిగారు. తాంబూలాలు పుచ్చుకోవడానికి వెంటనే బయలుదేరి రమ్మన్నారు. ఆ రాత్రల్లా ఆమె ఆలోచించింది. ఇన్నాళ్లు అష్టకష్టాలుపడింది ఎవరికోసం ? ఈ నాడు ఇంకొకరి వశంకావాలా ? తననుకూడా రమ్మన్నారుగా. వెళ్తే వారు సరిగా చూస్తారో, చూడరో ? అవును. వాళ్లు లక్షాధికారులు. తనా, ఒక పూట కూళ్ళ పెద్దమ్మ అని అంతరాత్మ ఒకవైపు ప్రశ్నించింది. 'నీవా పెద్దదానివి అయ్యావు. నీవు ఎవరి సుఖం కోరుతున్నావు ? నీకు ఇంతకన్నా అదృష్టం దొరుకుతుందా ? నీవు ఎవరి సుఖము కొరకై కష్టాలుపడుతూ భూమిమీద నిలిచావో,

వాడు సుఖపడడం ఇష్టంలేదా? నీ కుమారునిమాట జవదాటుతారా? నీకు స్వేచ్ఛ ఎందుకు ఉండదు? నీ కుమారుడు ఇంత గొప్ప యింటివారి అల్లుడు కావడం ఇష్టంలేదా? నీ కుమారుడు ఏ పూటకూళ్ళ పెద్దమ్మ అల్లుడు అయితే బాగుంటుందా? అని ఇంకొకవయిపు బాధించింది. చివరకు నలుగురు పెద్ద మనుష్యుల సలహామీద తాంబూలాలు పుచ్చుకొడానికి బెజవాడ వెళ్ళింది.

వివాహ మహోత్సవం బ్రహ్మాండంగా జరిగింది. తన కుమారుని అదృష్టమునకు ఎంతో మురిసిపోయింది. పెండ్లికి వచ్చిన చాలా మంది పెద్దలు "ఇదేమి సంబంధమా?" అని ఆశ్చర్యపోయారు. ఎవరేమనుకున్నా వివాహము అయిపోయింది. కొడుకు, కోడళ్ళను ఆనంద భాష్పాలతో దీవించింది. ఇద్దరూ జంటగా తిరుగుతూ ఉంటే ఆనందంతో ఉప్పొంగిపోయింది.

సత్యం పరీక్షలు అయిపోయినవి. త్వరలోనే పరిక్షా ఫలితాలుకూడా వెలువడినవి. మద్రాసు విశ్వవిద్యాలయములో ప్రథముడుగా కృతార్థుడయినాడు. సీతమ్మగారు "భోజనహోటలుబోర్డు" వెనుకకుతిప్పి కుమారునితోకూడా బెజవాడ చేరింది. ఊరకే ఉండడం దేనికని సత్యం అచ్చటనే కళాశాలలో లెక్చరరుగా ప్రవేశించాడు.

కాలచక్రం తిరిగిపోతున్నది. సీతమ్మగారికి ఆ యింటిలో స్వేశ్ఛలేకున్నది. కోడలు చాలా హీనంగా చూస్తున్నది. ఇది అంతయూ కుమారునికి తెలియదు. అతను లేనప్పుడు నూటి, పోటీ మాటలు అనడం మొదలు పెట్టింది. ఒక్క మాటయినా కుమారునికి చెప్పలేదు. తాను మొదట ఏమయితే అనుమానించిందో అక్షరాలా జరుగుతున్నది. కుమిలి, కుమిలి పోతున్నది.

"నాయనా! సత్యం!! నేను మనవూరికిపోయి ఉండాలని పీకుతున్నది, నాయనా" అన్నది ఒక రోజు.

"అదేమిటమ్మా! అట్లా అంటున్నావు. నీకు ఇక్కడ బాగా జరగడంలేదా? నిన్ను సరిగా చూడడంలేదా? ఏంజరిగిందో, చెప్పమ్మా?"

"అబ్బే. ఏమిలేదు నాయనా! నాకు హాయిగానే ఉంటున్నది. కమలకూడా మంచిపిల్ల. ఏమో, మనస్సు అక్కడికే పీకుతున్నది. మన ఇంటిలోనే ఉండాలని ఉన్నది. ఇక్కడకు దగ్గరే కాబట్టి రెండు, మూడు రోజులకు ఒకమారయినా చూచి పోతుండవచ్చు. నీవూ, కోడలూ సుఖంగా ఉంటే నాకేమి కావాలి నాయనా!"

"సరే, నీ ఇష్టము అమ్మా." సత్యంకు తల్లిబాధ ఏమితెలుసు. ఉదయం 10 గంటలకువెళ్ళి మరల సాయంత్రం 6 గంటలకు తిరిగివస్తాడు. తన భార్య ఎట్లా ప్రవర్తిస్తున్నదీ, తనకేమి తెలును. తల్లికూడా కుమారుని మనస్సు బాధకలుగుతుందని ఒక్కనాడు కూడా ప్రస్తాపించి ఎరుగదు.

సీతమ్మగారు స్వగ్రామం చేరింది. పూటకూళ్లు తీసివేసింది. ఏదో, సత్యం కొంత డబ్బు పంపుతూ ఉంటే కాలంగడుపుతున్నది. కుమారుడుకూడా మూడు నాల్గు రోజులకువచ్చి తల్లిని పరామర్శచేసి పోతుండెడివాడు. చాలా సార్లు కోడలును తీసుకు రమ్మని కోరింది. కమల బస్తీవానురాలాయెను. అందులో గొప్ప యింటి బిడ్డ. తన హోదాకు ఈ పల్లెటూరు రావడం అసలు ఇష్టంలేదు. సత్యంకు ప్రతిసారి, ఏదో సాకుచెప్పి తప్పించుకొనెడిది.

ఆ గ్రామంలో తెలిసినవారు "మీ కోడలును ఒక్కసారయినా రప్పించవేవమ్మా" అని అంటూ ఉండేవారు. మరి కొందరు "నీ కోడలుకు అంత గర్వమేమమ్మా? ఈ ఊరికి ఒక్కసారివచ్చి నిన్ను చూసిపోకూడదా? అయినా ఆమెగారు ఈ పూట కూళ్ళ సీతమ్మగారి ఇంటికి వస్తుందా?" అని అంటూ ఉండేవారు. సీతమ్మగార్కి మనస్సులో "బాకులతో చెలగినట్లు" ఉండేది, ఈ మాటలు విన్నప్పుడు. ఒక్కొక్కరోజు నిద్రపోయేదికాదు. కుమిలి, కుమిలి ఏడ్చేది. అంతా తన ఖర్మ అని అనుకుండేది.

కాని కుమారుడు వచ్చినప్పుడు మాత్రం అమితానందముతో ఉండేది.

ఈ విధంగా ఒక సంవత్సరము గడిచిపోయింది. సీతమ్మగారు మనోవ్యాధితో మంచం ఎక్కారు. కుమారుడు ప్రతిదినము వచ్చిచూచి పోతుండెడివాడు. వారం రోజులు గడిచింది. తల్లికి వ్యాధి తీవ్రరూపం దాల్చింది. సత్యం కాలేజీకి ఒక నెల శెలవుపెట్టాడు. తన భార్య కమలను తీసుకురావాలని చాలా ప్రయత్నించాడు. కానీ విఫలుడయ్యాడు. తాను మాత్రం తల్లివద్దనే ఉంటూ సపర్యలు చేస్తూ ఉన్నాడు. ఒక రోజు తల్లి కుమారుని "కోడలును ఒక్కసారి తీసుకురా, నాయనా!" అని కోరింది. మనస్సులో ఇష్టంలేకపోయినా తల్లిమాట తీసివేయలేక బయలు దేరాడు. త్రోవ పొడుగునా, "కమల వస్తుందా? రాదా?" అని పీకింది.

"కమలా! మా అమ్మగారు మంచంలో నిన్ను ఒక్కమారు చూడాలని అడుగుతున్నది. నీవు వెంటనే బయలుదేరివస్తే బాగుంటుంది."

"ఆ పల్లెటూరు ఎవరు వస్తారండీ? అక్కడ Manners తెలిసిన వాళ్లు ఒక్కరూ ఉండరు. ఏదో వాగుతారు నేను వస్తే ఒక ఎగ్జిబిషన్ తయారవుతుంది. అదినాకు బాగుండదు."

"అది కాదు!... కమలా!! నా తల్లి అష్ట కష్టాలుపడి నన్ను ఇంత వాడిని చేసింది. నాకొరకై పడరాని పాట్లు పడ్డది. నిన్ను ఒక్కసారి, నా తల్లి కోరిక నెరవేర్చుటకై రమ్మని వేడు కొంటున్నాను ... కమలా."

"మరేమయినా, అనండి. నేను ఆ ఊరికిరాను. "పూటకూళ్ళ సీతమ్మకోడలు అదిగో" అని అనిపించుకోలేను ...."

"ఆగు .... ఏమన్నావు. నా తల్లినా, నీవుఅనేది. నాకన్న తల్లినా నీవుతుత్కరించేది. నా సుఖముకొరకై పడరాని పాట్లుపడ్డదే! అటువంటి నా పవిత్ర తల్లినేనా......నీవు అనేది. నవమాసాలు మోసి నన్ను పెద్దచేసిన మాతృమూర్తినేనా ... నీవనేది..."

"అవును, మీ తల్లి కాబట్టి మీరు సేవచేస్తారు. మీ అమ్మ మీకు ఎక్కువ; నాకేమీ అవసరంపట్ట లేదు ... కావాలంటే ఆమెగారినే ఇచ్చటకురప్పించండి, అంతే కానీ ......నేనుమాత్రంరాను. ... పూటకూళ్ల శీతమ్మ కోడలు అని అందరిచేత అని పించుకోలేను........"

"ఆ!!! ... ... ఏమిటన్నావు" అని బలం కొద్ది చేతికందిన గ్లాసుతో ఒక్కయేటు వేశాడు. "ఛీ! పాపాత్ముకారాలా...నీవునా భార్యవుకావు... నా పాలిట ఒక దయ్యానివి ... ... నీ ముఖం చూస్తేనే సమస్తపాతకాలూ చుట్టుకొంటాయి ... నా తల్లిని, కన్నతల్లిని దూషించిన దానివి నాశనమై పోతావు. నీనాశనం కొరకే ఎదురుచూస్తాను. నా తల్లి నిన్ను చూచినా పాతకం చుట్టుకొంటుంది. నీవు నా భార్యవుకావు. మనిద్దరం బ్రతికుండగా కలుసు కోలేము. నీ ధనంతో నీవే ఆనందం అనుభవించు..." అని చరా, చరా బయటకునడిచాడు. క్రింద ఉన్న అత్తగారూ మామగారు వెళ్ళిపోతున్న సత్యంను పిలిచారు. వినిపించుకోకుండా వెళ్ళిపోయాడు. వారిద్దరూ పైకి వెళ్ళి గదిలో చూచారు. ఇంకేముంది ... కమల బలమయినగాయంతో పడిఉన్నది.

సత్యం తల్లివద్దకు వచ్చాడు. అప్పుడే డాక్టరు పరీక్షచేసి వెళ్ళుతున్నారు డాక్టరును "ఎట్లా ఉందండి" అని ప్రశ్నించాడు. డాక్టరు విచారంతో "ఇంకొద్దిక్షణాలలో..."అనిమాత్రం అనకలిగాడు. "అమ్మా" అని సత్యం తల్లిపాదాలపైపడి పసివానిలా విలపించడం మొదలుపెట్టాడు. తల్లి "నా...... య......నా! ......అమ్మాయి... రా ...లే... దా?" అని అడిగింది. "అమ్మా! అది నీ కోడలు కాదమ్మా. ఏనాడో మన పాలిటి భూతం అమ్మ! దాని పేరు తలిస్తేనే పాపం తగుల్తుంది. ... అమ్మా! ..."

"నా ... య.. నా... మీ...రి...ద్ద...రు ..

సుఖం... " అంటూనే కుమారుని కౌగిటిలో తీసుకొని కళ్లు మూసింది. సత్యం "అమ్మా" అంటూ ఒక్కటే కేకవేసి తల్లి పాదాలమీద పడ్డాడు. తెలిసిన వారందరూ చేరారు. సత్యంకు స్పృహలేదు సత్యం ముఖంమీద నీళ్ళుకొట్టి లేవతీసి, సముదాయించారు. ఎలాగయితేనేం, దహన సంస్కారములు చేయించారు. స్మశాన వాటికనుండి సత్యం తిరిగిరాలేదు. ఎందరో నెమ్మదిగా చెప్పారు. మాట్లాడడు. చివరకు బలవంతంమీద తీసుకురావాలని ప్రయత్నించారు. తనదగ్గరకు వచ్చిన వారినందరినీ ఇష్టంవచ్చినట్లు కొట్టి, రక్కాడు. ఎవ్వరూ ఏమియూ చేయలేక సత్యంను వదలివేసి వచ్చారు.

ఆ రాత్రి అంతయూ అక్కడనే ఉన్నాడు. మరునాడు శరీరమంతా బూడిద పూసుకొని "అమ్మా, అమ్మా!!" అంటూ ఊళ్ళోకివచ్చాడు. వంటిన ఒక్కధోవతి తప్ప ఇంకేమియూ లేదు. ఈ కబురు బెజవాడలో తెలియగానే కమల, మామ, అత్తగారు కారులోవచ్చారు. సత్యంను చూడగానే అందరికీ భయంవేసింది. కమలనుచూడగానే సత్యం "ఆ ... హ హ...హ...హ...హా నా భార్యామణి వచ్చిందా? పూటకూళ్ళ శీతమ్మ కోడలేనా ... లక్షాధికారి ... చూడండి అందరూ చూడండి ... రా ... నన్ను తీసుకుపోవడానికి వచ్చావా...హ...హ...హ...హ...హా" అంటూ పరుగునవచ్చి కమల కంఠం పట్టుకొని పిసకపోయాడు. అక్కడివారందరూ సత్యంను ఇవతలకు లాగిపట్టుకొన్నారు. వదలించుకోడానికి పెనుగులాడాడు. చివరకు త్రాళ్లతో బంధించారు. ఇక అక్కడ ఉండడం మంచిదికాదనుకొని కమలా వాళ్ళు వచ్చిన త్రోవనే వెళ్ళారు. సాయంత్రానికి సత్యంకు అన్నం పెట్టాలని ప్రయత్నించారు. కాని తినలేదు. ఒకటే ఏడుపు. వదిలిపెట్టమని ఏడ్చాడు. అందరూ వదిత్తే ఏమిచేస్తాడో అని భయపడ్డారు. మరునాడు ఉదయం ధైర్యంచేసి కట్లు విప్పారు. ఎవ్వరినీ ఏమీ అనలేదు. ఒకటే స్మరణ. "అమ్మ ... అమ్మా ... అమ్మ" అంటూ రెండు రోజులు ఆ గ్రామంలో తిరిగాడు. రెండవ రోజు రాత్రి ఒక చెట్టుక్రింద కూర్చొని ఉండడం ఆ గ్రామంలో అందరూ చూచారు. రాత్రి ఎనిమిది గంటలకు వాన మొదలు పెట్టింది. సత్యంను తీసుకువెళ్ళడానికి చాలా మంది ప్రయత్నించారు. కాని రాలేదు. మరుసటి రోజు ఉదయం ఆ చెట్టుక్రిందలేదు. ఎక్కడకు వెళ్ళాడా, ఏమయినాడా అని ఆ గ్రామం అంతా గాలించారు. ఆనవాలు లేదు. అప్పటికి, ఇప్పటికి ఏమయిపోయిం ఎవ్వరికీ తెలియలేదు. ఏమయిందీ, ఆ సృష్టికర్తది భగంతునికే తెలియాలి.

పాత్రుడుగారి

బాలసంజీవిని (Regd)

పిల్లల లివర్ అండ్ స్ప్లీన్ వ్యాధులను నివారించును

డాక్టరు పిల్లా పాపయ్య పాత్రుడు అండ్ బ్రదర్స్,

19, దక్షిణ మాడవీధి, మైలాపూరు, మదరాసు-4. Phone 71354

కుంభకోణము బ్రాంచి: 7. సారంగపాణి కోవిల తూర్పువీధి.

అన్ని మందుల షాపులలోను దొరకును.